# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 08-02-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. వేవ్స్ సదస్సు నిర్వహణపై పలువురు నటీనటులు, వ్యాపారవేత్తలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశాన్ని నిర్వహించారు.
2. **విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న దక్షిణకోస్తా రైల్వే జోన్‌కు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపింది.**
3. **ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు.**
4. **తెలంగాణలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన చేపట్టామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు**
5. **తెలంగాణలో డ్రోన్ సాంకేతికత విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు వెల్లడించారు.**

==========================

భారత్‌ను ప్రపంచ వినోదరంగ కేంద్రంగా మార్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది చివర్లో 'వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్-వేవ్స్' సదస్సును నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో నిన్న భారతీయ చలన చిత్ర పరిశ్రమకు చెందిన ప్రముఖ నటీనటులు, వ్యాపారవేత్తలతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీ నుంచి దృశ్య మాధ్యమ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అమితాబ్ బచ్చన్, రజనీకాంత్, చిరంజీవి, నాగార్జున, హేమమాలినీ తో పాటు పలువురు నటీనటులు పాల్గొన్నారు. అలాగే ప్రముఖ పారిశ్రామిక వేత్తలు ముకేశ్ అంబానీ, ఆనంద్ మహీంద్రా కూడా ఈ సమావేశంలో పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు.

అనంతరం ఈ సమావేశంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, 'వేవ్స్' సలహా సంఘంతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ బోర్డులో సభ్యులైన నటీనటులు, వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు భారత్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మద్దతు పలకడంతోపాటు సదస్సు కోసం వారి విలువైన సలహాలు, సూచనలు అందచేశారని పేర్కొన్నారు.

--------------------------

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న దక్షిణకోస్తా రైల్వే జోన్‌కు కేంద్రమంత్రి వర్గం ఆమోదం తెలిపిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న

ఢిల్లీలో జరిగిన కేంద్ర మంత్రి వర్గ సమావేశ నిర్ణయాలను కేంద్ర మంత్రి పాత్రికేయులకు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం రాష్ట్రంలో కొత్త రైల్వే జోన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. వాల్తేరు రైల్వే డివిజన్‌ను విశాఖపట్నం రైల్వే డివిజన్ గా పేరు మారుస్తున్నామని అశ్విని వైష్ణవ్ తెలియజేస్తూ

వాయిస్ 38.. సెకన్లు

అలాగే స్కిల్ ఇండియా కార్యక్రమాన్ని కొనసాగించేందుకు 8 వేల 8 వందల కోట్ల రూపాయల కేటాయింపులకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందని, వివిధ నైపుణ్యాభివృద్ధి పథకాలను 'స్కిల్ ఇండియా' పథకం కిందికి తీసుకొచ్చినట్లు తెలిపారు. జాతీయ సఫాయీ కర్మచారీ కమిషన్ పదవీకాలాన్ని మరో మూడేళ్లపాటు పొడిగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో సంక్షేమంతో పాటు అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉద్ఘాటించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్, అన్న క్యాంటీన్లు వంటి పథకాలతో సంక్షేమం అమలు చేస్తూనే.. మౌలిక సదుపాయాలు, పెట్టుబడుల సాధనతో అభివృద్ధిని వేగవంతం చేస్తున్నామని చెప్పారు. సుపరిపాలనతో సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని, ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని అన్నారు. పనితీరుపై సమీక్షించుకుని ఉత్తమపాలన అందించేందుకే రాష్ట్ర మంత్రులకు ర్యాంకులు ప్రదానం చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని కులగణన చేపట్టామని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తెలిపారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, మంత్రి వర్గ విస్తరణ ప్రస్తుతం ఉండదని స్పష్టం చేశారు. మంత్రివర్గంలో ఎవరికి స్థానం కల్పించాలనేది అధిష్ఠానం నిర్ణయిస్తుందని తెలిపారు. సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. కులగణనలో బీసీలు ఐదున్నరశాతం పెరిగారని. ఈ గణన ద్వారా రిజర్వేషన్లకు శాశ్వత పరిష్కారం లభించిందని అన్నారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ – పీసీసీ కార్యవర్గం కూర్పు పూరైందని, దీనిపై ఒకట్రెండు రోజుల్లో ప్రకటన వెలువడుతుందని ముఖ్యమంత్రి వెల్లడించారు. అంతకుముందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేను కలిసి కులగణన, ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన నివేదికలను అందజేశారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో జల జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికీ తాగునీటి కొళాయిని ఏర్పాటు చేసి స్వచ్ఛమైన మంచినీటిని సరఫరా చేస్తామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఆత్మకూరులోని టిడ్కో కాలనీని ఆయన నిన్న సందర్శించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో జల జీవన్ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధులను కేటాయించిందని చెప్పారు. ప్రజల వినతుల మేరకు టిడ్కో కాలనీల్లో రామాలయాలను నిర్మిస్తామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రముఖ తెలుగు చలన చిత్ర నటులు అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్ర పుస్తకాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆవిష్కరించారు. ఢిల్లీలోని పార్లమెంట్ భవనంలో అక్కినేని నాగార్జునతో సహా ఇతర కుటుంబ సభ్యులు ప్రధాన మంత్రిని నిన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మాజీ పార్లమెంట్ సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఏఎన్నార్ పై సంకలనం చేసిన పుస్తకాన్ని నరేంద్ర మోదీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధానికి చలన చిత్ర నటులు నాగార్జున కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఇటీవల 'మన్ కీ బాత్'లో సైతం అనితర సాధ్యమైన నటనతో తెలుగు ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న అక్కినేని నాగేశ్వరరావు గురించి ప్రధానమంత్రి ప్రస్తావించడం తెలిసిందే.

---------------------------

తెలంగాణలో డ్రోన్ సాంకేతికత విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో సెంటిలియాన్, హెచ్‌పీ రోబోటిక్స్ సంస్థల ప్రతినిధులతో మంత్రి నిన్న సమావేశమైయ్యారు. ఈ సందర్భంగా శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపన, పెట్టుబడులను ఆకర్షించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని అన్నారు. ఈ ఏడాది కొత్తగా 500 ఉద్యోగాలు కల్పించనున్నట్లు మంత్రి తెలుపుతూ..

వాయిస్ .. 40 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో వివిధ పథకాల కింద రావాల్సిన నిధుల్ని విడుదల చేయాలని కేంద్ర న్యాయ సాధికారతశాఖ మంత్రి వీరేంద్రకుమార్ ను రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి కోరారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన నిన్న కేంద్రమంత్రితో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. ఈ మేరకు ప్రధాన్ మంత్రి అనుసూచిత్ జాతి అభ్యుదయ్ యోజన – పీఎం అజయ్ పథకం కింద రాష్ట్రంలో ఎంపిక చేసిన 526 గ్రామాలకు 110 కోట్లు, 75 సాంఘిక సంక్షేమ వసతి గృహాల నిర్మాణానికి 245 కోట్ల రూపాయలు విడుదల చేయాలని కోరారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకులాల్లో మౌలిక వసతుల కల్పనకు 193 కోట్లు, ఎస్సీ, ఎస్టీ ఎట్రాసిటీ బాధితులకు పరిహారం నిధుల నిమిత్తం 95.84 కోట్ల రూపాయలు విడుదల చేయాలని కేంద్రమంత్రికి వినతి పత్రాన్ని అందజేశారు.

---------------------------

ఈరోజు భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త, భారతరత్న డాక్టర్ జాకిర్ హుస్సేన్ జయంతి సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1897 ఫిబ్రవరి 8వ తేదీన హైదరాబాద్‌లో జన్మించిన ఆయన... 1967 మే 13వ తేదీ నుండి 1969 మే 3వ తేదీ వరకు దేశానికి మూడవ రాష్ట్రపతిగా వ్యవహరించారు. అలాగే స్వాతంత్ర్య భారతదేశ రెండవ ఉపరాష్ట్రపతిగా, బీహార్ గవర్నర్‌గా కూడా సేవలందించారు. దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలకు గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం ఆయనను భారతరత్న పురస్కారంతో సత్కరించింది.

=====================